

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సభలకు ఆహ్వానిస్తున్న వారధి సంస్థ ప్రతినిధులు

'వారధి' ఆవిర్భావం.. 27న సమావేశం

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంఘం, సంస్కృతి, వాణిజ్యం (3సీ) ఈ మూడు ప్రధానాంశాలుగా కార్యకలాపాలు నిర్వహించేందుకు వారధి సంస్థ ఏర్పాటైంది. ఈ సంస్థ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గంజి జగన్ బాబు తెలిపారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలో ఉండే చిన్న వ్యాపారులను అనుసంధానించడానికి తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(టీఏఎంసీసీఐ) సంస్థ పనిచేస్తుందన్నారు. వారధి ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మార్గదర్శి సంస్థల ఎండీ శైలజా కిరణ్, సినీ నటుడు సాయికుమార్, పారిశ్రామికవేత్తలు, ప్రముఖ వ్యాపారులు, సంస్కృతి, వాణిజ్య రంగాల ప్రముఖులు హాజరవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న సామగ్రి, వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

సులభంగా డబ్బు సంపాదించాలని..

నకిలీ యూఎస్ డాలర్లు, నోట్ల ప్రింటింగ్

- నిందితుడి అరెస్టు
- రూ. 5 లక్షల విలువగల 500 ఫేక్ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నకిలీ నోట్లు తయారు చేసి సరఫరా చేస్తున్న నిందితుడిని ఎల్బీనగర్ ఎస్ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా, ఆత్మకూర్ మండలం, అమరచింత గ్రామానికి చెందిన కర్లి నవీన్‌కుమార్ డిప్లొమా ఇన్ మల్టీమీడియా పూర్తి చేశాడు. ఆర్థిక ఇబ్బందులు రావడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు నకిలీ నోట్లు తయారు చేయాలని పథకం వేశాడు. నోట్ల తయారీకి పనికి వచ్చే 45 జీఎస్ఎం పేపర్ కోసం ఇండియా మార్ట్‌లో వెతుకుతుండగా కోల్‌కతాకు చెందిన వ్యాపారి పరిచయం అయ్యాడు. నకిలీ నోట్ల తయారీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చాడు. నోట్ల తయారీ కోసం ప్రింటర్, కలర్స్ కొనుగోలు కోసం కర్నూల్‌లో ఉన్న స్నేహితుడిని నవీన్ సంప్రదించగా అతడు డబ్బు ఇవ్వడంతో ఎప్సన్ ప్రింటర్, కలర్స్ కొన్నాడు. ఈ ప్రింటర్ సాయంతో తీసిన రూ. 500నోట్లు సరిగా రాకపోవడంతో కోల్‌కతా వ్యాపారి నోట్లలో ఉండే కరెన్సీ త్రెడ్‌ను పోలిన పేపర్‌ను నవీన్‌కు పంపాడు. ఆ పేపర్‌తో సెక్యూరిటీ త్రెడ్ తయారు చేశాడు. త్రెడ్‌ను పేపర్లలో పెట్టి కొరియర్ ద్వారా కోల్‌కతా, విజయవాడ, గుజరాత్ పంపించాడు. యూఎస్ డాలర్ వాటర్‌మార్క్ షీట్లను కూడా తయారు చేసి వేర్వేరు ప్రాంతాలకు కొరియర్ చేశాడు.

నోట్‌లకు సంబంధించిన త్రెడ్‌లు సరఫరా చేస్తున్న తరుణంలో కోల్‌కతా వ్యాపారి గుజరాత్‌కు చెందిన వ్యక్తిని పరిచయం చేశాడు. గుజరాత్ వ్యక్తి నవీన్‌ను కలిసేందుకు హైదరాబాద్ వచ్చాడు. నవీన్‌కు కరెన్సీ ప్రింట్ చేసేందుకు ఖరీదైన ప్రింటర్‌ను ఇప్పించాడు. నవీన్‌కు పేపర్ షీట్‌కు రూ.50 చొప్పున 25 లక్షల షీట్ ప్రింట్ చేసి ఇచ్చే ఆర్డర్ కూడా వచ్చింది. గుజరాత్‌కు చెందిన వ్యక్తి ఆర్డర్ మేరకు రూ.500 నకిలీ నోట్లు రూ.5 లక్షల విలువగలవి ప్రింట్ చేశాడు. ఈ నోట్లను డెలివరీ ఇచ్చేందుకు తుక్కుగూడ జంక్షన్‌లో వేచి చూస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. నిందితుడు నవీన్ నుంచి నకిలీ రూ.500 నోట్లు, రంగులు, ప్రింటర్, 45 జీఎస్ఎం పేపర్, కలర్స్, గాంధీ బొమ్మ వేసిన స్క్రీన్ ప్రింటింగ్ ఫ్రేములు, సెక్యూరిటీ దారం ఉన్న పేపర్లు స్వాధీనం చేసుకున్నారు.



ఫుట్ ఆంకిల్ కేర్ కేంద్రం ప్రారంభోత్సవంలో వైద్యులు

మధుమేహంతో పాదం సమస్యలు

- నరాలు బలహీనపడితే ఆకారంలో మార్పు
- అందుబాటులోకి ఆధునిక చికిత్స
- అపోలో ఆస్పత్రిలో 'ఫుట్ ఆంకిల్ కేంద్రం ప్రారంభోత్సవంలో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాదం, మడమ సమస్యలు ఎక్కువశాతం మధుమేహం కారణంగా వస్తున్నాయని అపోలో ఆస్పత్రి పిల్లల శస్త్రనిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ శేషభట్టారు తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో 'ఫుట్ అండ్ ఆంకిల్ కేర్ కేంద్రం' ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నరాలు బలహీనపడినప్పుడు పాదం ఆకారంలో మార్పు వస్తుందన్నారు. దీనికి ఆక్యూట్ చార్కాట్ డిసీజ్ అనే అధునాతన న్యూరోపతి చికిత్స అందిస్తున్నామన్నారు. కింగ్స్ కాలేజ్ ఆస్పత్రి(లండన్) ఫుట్ ఆంకిల్ సర్జన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అధ్యక్షుడు డాక్టర్ వేణు కవర్తపు మాట్లాడుతూ.. మధుమేహ రోగుల్లో చలనం లోపిస్తే గుండె, మూత్రపిండాల వైఫల్యం, స్ట్రోక్ వంటి సమస్యలకు దారితీస్తుందన్నారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో మినహా భారతదేశంలో మరెక్కడా పాదం, చీలమండ సేవలు అందుబాటులో లేవన్నారు. మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. మధుమేహంతో బాధపడే రోగుల్లో చాలామందికి పాదం చీలమండ సమస్యలు ఉంటాయన్నారు. ఫుట్ ఆంకిల్ సర్జన్ వరుణ్ కొమ్మలపాటి, సీఈఓ తేజస్విరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి

- వైద్యాధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులను నడిపించే వ్యక్తులు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ కదిరివన్, అడిషనల్ డీసీపీ మనోహర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకట్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ తదితరులు పాల్గొన్నారు.

కేసు నుంచి తప్పించేందుకు లంచం.. ఇన్‌స్పెక్టర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేసు నుంచి పేరును తొలగించేందుకు లంచం తీసుకున్న ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎల్. బాలు చౌహాన్ గతంలో ఓ మిస్సింగ్ కేసులో పేరును తప్పించేందుకు బాధితుడి నుంచి రూ. 1.50 లక్షలు డిమాండ్ చేసి రూ. 50 వేలు తీసుకున్నాడు. బాలు చౌహాన్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇతడి అవినీతిపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు, బాధితుడి నుంచి లంచం తీసుకున్న విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. బాలును శుక్రవారం అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

ముగిసిన బడంగ్‌పేట్ కౌన్సిల్ చివరి సమావేశం

- రూ.63కోట్ల అంచనా తీర్మానాలకు ఆమోదం
- సభ్యులకు ఘనంగా సన్మానం
- సమష్టిగా పనిచేసి అభివృద్ధి సాధించాం : పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ కౌన్సిల్ చివరి సమావేశం శుక్రవారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రస్తుత పాలకవర్గానికి ఇదే లాస్ట్ మీటింగ్ కావడం గమనార్హం! ఈనెల 27వ తేదీతో పాలకవర్గాల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం నాటి కౌన్సిల్ సమావేశాన్నే వీడ్కోలు సమావేశంగా కూడా మలచుకుని సభ్యులను ఘనంగా సన్మానించారు. మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి కలిసి కార్పొరేటర్లతో పాటు కోఆప్షన్ సభ్యులకు సన్మానం చేయగా, కార్పొరేటర్లంతా కలిసి మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్లను సన్మానించారు. తమకు ఇదే చివరి సమావేశం కావడంతో పాలకవర్గంలోని సభ్యులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఐదేళ్లు కలిసి ఉన్న తాము ఇకపై కార్పొరేషన్‌కు దూరం కానున్నామని, పదవులు లేనప్పటికీ తమ డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి ప్రజల తరఫున తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్లు పేర్కొన్నారు. కాగా సుమారు రూ.63కోట్ల అంచనాతో రూపొందించిన ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

సమష్టిగా పని చేశాం.. అభివృద్ధి సాధించాం: పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధికి ఐదేళ్లుగా తామంతా సమష్టిగా పనిచేసి ఎంతో అభివృద్ధి సాధించామని మేయర్ పారిజాతారెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సైతం తమకు పూర్తిగా సహకరించారని, తమ పాలకవర్గం లేకున్నా అధికారులు, సిబ్బంది మునుపటిలాగే చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆమె సూచించారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా కార్పొరేషన్ అభివృద్ధికి కృషిచేసినట్టు చెప్పారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ సభ్యులందరి నుంచి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించి, వాటిని ఎజెండాల్లో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించినట్టు పారిజాతారెడ్డి పేర్కొన్నారు. నిధుల కేటాయింపులోనూ నిష్పక్షపాతంగా వ్యవహరించామని, పార్టీలకతీతంగా నిధుల కేటాయింపు జరిపామని ఆమె అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఫ్లోర్ లీడర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శోభాఆనంద్‌రెడ్డి, జెనిగె పద్మాఐలయ్యయాదవ్, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, బొద్రమోని రోహిణీరమేశ్‌ముదిరాజ్, సుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్‌యాదవ్, జెనిగె భారతమ్మాకొమురయ్యయాదవ్, బాలూనాయక్, ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, బండారి మనోహర్, రామోజీ అమితాశ్రీశైలంచారి, బంగారు అనితాప్రభాకర్, లిక్కి మమతాకృష్ణారెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, రామిడి కవితారాంరెడ్డి, భీమిడి స్వప్నాజంగారెడ్డి, గౌర రమాదేవి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు గుర్రం ప్రసన్నావెంకట్‌రెడ్డి, షేక్ ఖలీల్ పాషా, మర్రి జగన్‌మోహన్‌రెడ్డి, సమ్మైఖ్యజ్యోతి, డీఈఈలు జ్యోతీరెడ్డి, నర్సింహరాజు, ఏఈఈ వినీల్‌గౌడ్, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి



కౌన్సిల్ చివరి సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు

తుర్కయంజాల్ మున్సిపాలిటీ రూ.250 కోట్లతో అభివృద్ధి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నాలుగు సంవత్సరాలలో తుర్కయంజాల్ మున్సిపాలిటీలో రూ. 130కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంవత్సరంలో రూ.250కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం, కౌన్సిలర్ల వీడ్కోలు సమావేశం శుక్రవారం తుర్కయంజాల్‌లోని పరిణయ కన్వెన్షన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుమారు రూ. 50కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. కేవలం మున్సిపాలిటీ జనరల్ ఫండ్‌తోనే అభివృద్ధి పనులు చేసి గొప్పలు చెప్పుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇష్టంగా తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఐదు సంవత్సరాలలో రూ. 400కోట్లతో అభివృద్ధి పనులు చేసుకోగలిగామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గంపెడు అప్పుచేసి పెట్టినా ప్రతినెల వడ్డీ చెల్లిస్తూనే ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో 20వేల ఇళ్లను ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు అందిస్తామన్నారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 9 గ్రామాలకు తాగునీటి కష్టాలు తీర్చడానికి రూ. 21.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్ రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.500కోట్లు, ఆర్ అండ్‌బీ ద్వారా రూ. 200 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మున్సిపాలిటీ రాష్ట్రపతి చేతుల మీదుగా రెండు సార్లు అవార్డు తీసుకోవడం గర్వంగా ఉందని చైర్‌పర్సన్ అన్నారు. రేపటితో పాలకవర్గం గడువు ముగిస్తుండడంతో అధికారులు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిసాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరితధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు ఐలయ్య, మంగమ్మ, వేముల స్వాతి, కవిత, జ్యోతి, మాధవి పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో తుర్కయంజాల్ పాలకవర్గం సభ్యులు, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధారాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్యే మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుడిగా సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని.. అందుకోసం త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు అకాడమీని నెలకొల్పనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌చారి, ఈసీ శేఖర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ దేవదాసు గౌడ్, రాజు, విజయశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌కేశెట్టి, గౌస్‌పాషా, కృష్ణారెడ్డి, రాజేందర్, విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సుప్రసేనారెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



బాటసింగారంలో కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, పక్కన ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కార్మికుల మహాసభ సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరాగార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ జయశ్రీ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మైసయ్య, కార్యదర్శిగా జ్యోతిబస్, సభ్యులుగా జంగయ్య, నర్సింహ, లింగస్వామి, తరుణ్, దానయ్య, పాండు, లక్ష్మమ్మ, వసంత, కలమ్మ, నర్సమ్మ, రవి, పోచయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ, శివకుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

హయత్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని శుక్రవారం తుర్కయంజాల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఏబీసీ నాయకుడు కత్తి వెంకటస్వామి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కత్తి వెంకటస్వామి వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతి శేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేట జిల్లాకు చెందిన జెగ్గు మల్లారెడ్డి, కోశాధికారిగా హైదరాబాద్‌కు చెందిన జే. శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుజ్జ సత్యం, షేక్ షరీఫ్, కే. దయాకర్‌రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడిగా జలంధర్‌రెడ్డి, సలహాదారులుగా రాధాకృష్ణ, బుచ్చిరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జి. నారాయరెడ్డి, భరత్‌కుమార్, సీహెచ్. మీనేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యే రంగారెడ్డితో తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఫిబ్రవరి మొదటి వారంలో జీహెచ్ఎంసీ వార్డు సభలు

- వంద శాతం పూర్తైన రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే 67 శాతమే పూర్తి

చాదర్‌ఘాట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఫిబ్రవరి మొదటి వారంలో జరుగనున్న జీహెచ్ఎంసీ వార్డు సభల్లో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ వార్డు సభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు అర్హులైన లబ్ధిదారుల జాబితా ఆమోదించనున్నారు. అదేవిధంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల పేర్లు జాబితా లేకపోతే మరోసారి వార్డు సభల్లో దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఇక రేషన్ కార్డులు అందించేందుకు నూతన దరఖాస్తుల ప్రక్రియను నిరంతరం కొనసాగుతుందని జోనల్ కమిషనర్ వివరించారు. ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రూపొందించిన జాబితా ప్రకారం ఇప్పటి వరకు రేషన్ కార్డుల సర్వే ప్రక్రియ 100శాతం పూర్తైందన్నారు. రేషన్ కార్డుల కోసం చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట సర్కిల్-6లో 2,977 కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా, సంతోష్‌నగర్ సర్కిల్‌లో 1517 కుటుంబాలు, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో 6,275 కుటుంబాలు, చార్మినార్ సర్కిల్‌లో 1617 కుటుంబాలు, ఫలక్‌నామా సర్కిల్‌లో 1705 కుటుంబాలు, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 7,112 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచి రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన కోసం సర్వే చేపట్టగా 21వ తేదీ నాటికి వందశాతం సర్వే పూర్తి చేశారు.

చార్మినార్ జోన్ పరిధిలో..

చార్మినార్ జోన్ పరిధిలోని ఆరు సర్కిళ్ల పరిధుల్లో 2,12,177 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చాయని జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఇందులో 1,43,178 దరఖాస్తుల పరిశీలన సర్వే పూర్తైంది. 67.48 శాతం పూర్తి చేశారు. మిగతా 68,999 దరఖాస్తులపై సర్వే చేయాల్సి ఉంది. వివిధ కారణాలతో దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడంతో వాటి సర్వే వివరాలను తెలుసుకోలేకపోయారని తెలిపారు. మలక్‌పేట సర్కిల్‌లో 36,716 దరఖాస్తులు రాగా 21,580 దరఖాస్తులపై సర్వే పూర్తి చేశారు. అదేవిధంగా సంతోష్‌నగర్ సర్కిల్‌లో 31,400 దరఖాస్తులు రాగా, 23,247 దరఖాస్తుల సర్వే పూర్తి చేయగా, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో 40,358 దరఖాస్తులు రాగా 28,439 దరఖాస్తుల సర్వే, చార్మినార్ సర్కిల్‌లో 17,161 దరఖాస్తులు రాగా 10,536 దరఖాస్తుల సర్వే, ఫలక్‌నామా సర్కిల్‌లో 32,596 దరఖాస్తులు రాగా, 18,941 దరఖాస్తుల సర్వే, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 53,946 దరఖాస్తులు రాగా, 40,435 దరఖాస్తుల సర్వే పూర్తైనట్లు వివరించారు. వీటితోపాటు అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.



టి.వెంకన్న, జోనల్ కమిషనర్

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

అబ్దుల్లాపూర్‌మెట్ : దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

టెక్నాలజీతో సవాళ్లను ఎదుర్కొందాం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని వినియోగంతో మానవాళి ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, సహజ వనరులు తగ్గిపోవడం వంటి సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సస్టెయినబుల్ మెటీరియల్స్, టెక్నాలజీస్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్' అంశంపై శుక్రవారం జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి డాక్టర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలకు అకడమిక్, ఇండస్ట్రీల నుంచి మేధావులను ఆహ్వానించి వారితో చర్చించడం ద్వారా పలు సామాజిక సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అలాగే సాంకేతిక విద్యకు సంబంధించిన సిలబస్ రూపకల్పన దేశాభివృద్ధికి దోహదపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ అమరనాథ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ రామశాస్త్రి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి నాగమల్లేశ్వరరావు, సదస్సు కన్వీనర్ మురళీధరరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: రాధారెడ్డి

ఎల్‌బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్‌లోని పెం డింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి కోరారు. శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాతతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల ను ఆమె వివరించారు. సమావేశంలో ఈఈ శ్రీనివాస్, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రవాణాశాఖ హెడ్ కానిస్టేబుళ్ల సమస్యలపై వినతి

మన్సూరాబాద్ : రాష్ట్ర రవాణా శాఖలోని హెడ్ కానిస్టేబుళ్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ట్రాన్స్‌పోర్టు హెడ్‌కానిస్టేబుల్స్ అండ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాయకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రవాణా శా ఖ కమిషనర్ సురేంద్రమోహన్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశాఖకు సంబంధించిన కానిస్టేబుళ్లలో హెడ్‌కానిస్టేబుళ్లు 20శాతం అంటే 40మంది ఉండాల్సి ఉండగా 29పోస్టులు మాత్రమే ఉన్నాయన్నారు. ఏఎంవీఐ పోస్టుల్లో హెడ్‌కానిస్టేబుళ్లకు ఉన్న 5శాతం రిజర్వేషన్‌ను 20 శాతంకు పెంచాలని, ప్రమోషన్లలో కానిస్టేబుళ్లను సైతం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేగళ్ల ప్రతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, హనుమంతు, నవీన్ పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

చాదర్‌ఘాట్ : విధి నిర్వహణలో ట్రాఫిక్ రద్దీలో ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా బస్సులను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతారని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపోకు చెందిన నలుగురు ప్రమాద రహిత డ్రైవర్లను డిపో మేనేజర్ సమత, మలక్‌పేట ట్రాఫిక్ ఎస్ఐ కె.రాము, వినోద్‌కుమార్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. 35 సంవత్సరాలుగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన అరుణ్‌కుమార్, సూర్యకుమార్, ఇబ్రహీంఖాన్, రాములుకు అవార్డులను అందజేసి ప్రశంసించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హయత్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డ్రైవర్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం హయత్‌నగర్-1,2 ఆర్టీసీ డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్‌లు డ్రైవర్లకు పుష్పాలను అందించారు. అనంతరం ఉద్యోగుల చేత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ బస్ టర్మినల్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిపో మనేజర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. డ్రైవర్లకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, సయ్యద్ పాల్గొన్నారు.

సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల చోరీ

చాదర్‌ఘాట్ : ఓల్డ్‌మలక్‌పేటలోని ఓ మొబైల్ షాపులోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను చోరీ చేసిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఓల్డ్‌మలక్‌పేటలోని రేస్ కోర్స్ రోడ్‌లో ఉన్న క్యూ మాక్స్ మొబైల్ షాపును శుక్రవారం తెరిచేందుకు వచ్చే సరికి మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లు షాపు నిర్వాహకుడు గుర్తించాడు. వెంటనే చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం ఇన్‌స్పెక్టర్ సైదులు తన సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక వైపు ఉన్న కిటికీలో నుంచి షాపులోకి చొరబడి 30 సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు చోరీకి కారకులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

బాలల లైంగిక హింసపై అవగాహన

రంగారెడ్డి జిల్లా కోర్టులు : రంగారెడ్డి జిల్లా కోర్టులోని జిల్లా న్యాయ సేవా సదన్‌లో బాలల లైంగిక హింసపై అవగాహన కలిపించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత 3నెలల వరకు అవకాశం ఇవ్వాలన్నారు. సంఘటన జరిగిన చోటు నుంచి మరో చోటికి బదిలీకి ఒక కమిటీ వేయాలని జిల్లా స్థాయిలో ఒక నోడల్ అధికారి ఉన్నారన్నారు. నోడల్ అధికారి పాత్ర చెప్పుకోదగినదన్నారు. కార్యక్రమంలో అమితారాణి, ప్యారాలీగల్ వలంటీర్లు అరుణ, రజనీ, మీనాక్షి, బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.